క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



పెనమలూరు: పోరంకిలో వేంచేసి ఉన్న శ్రీవసంత వేణుగోపాలస్వామివారి ఆలయంలో కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయంలో గురువారం ఉదయం స్వామివారికి నిత్యహోమం చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ఆరు గంటలకు శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వసంత వేణుగోపాలస్వామివారికి దివ్య తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని భక్తులు కనులపండువగా తిలకించారు. భక్తులు స్వామివారికి అక్షింతలు వేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా శుక్రవారం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగిస్తారు. అలాగే యనమలకుదురులో కూడా శ్రీ సంతాన వేణుగోపాలస్వామివారి ఆలయంలో స్వామివారికి కల్యాణం ఘనంగా నిర్వహించారు.

శ్రీవెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలతో అర్చన



నున్న(విజయవాడరూరల్): శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామివారి ఆలయం చినకంచిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం శ్రీవెంకటేశ్వరస్వామికి లక్ష మల్లెలతో అర్చన, నీరాజన మంత్ర పుష్పాలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీవెంకటేశ్వరస్వామికి ఎంతో ఇష్టమైన వైశాఖ పూర్ణిమ సందర్భంగా చండీ హోమం చేశారు. కలశపూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణం జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ, అన్నసంతర్పణ చేశారు. సాయంత్రం చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిని నంది వాహనంపై ఊరేగింపు వనోత్సవం జరిపారు. శుక్రవారం శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి 131వ జయంతి కార్యక్రమం నిర్వహించబడునని ఆలయ ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు.

పాఠ్యపుస్తకాల పంపిణీకి సిద్ధం



నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ సిద్ధం చేసింది. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను విద్యాశాఖ పంపినట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.వెంకటరత్నం గురువారం తెలిపారు. మండల ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూల్స్‌లో చదివే విద్యార్థులకు మొత్తం 39,333 పాఠ్యపుస్తకాలు వచ్చినట్టు ఆయన తెలియజేశారు. ఈ పుస్తకాలను నున్న గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో భద్రపర్చినట్టు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు అవ్వడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉంగుటూరు మండలం మానికొండ అడ్డరోడ్డుకు చెందిన కుందేటి నాగలక్ష్మి పోరంకి పచ్చళ్ల కంపెనీలో పని చేస్తుంది. ఆమె పనికి రావడానికి సోదరుడి బైక్‌పై పోరంకికి బయలుదేరింది. అయితే వారు ప్రయాణిస్తున్న బైక్ గంగూరు పెట్రోల్ బంక్ వద్దకు రాగా గుర్తు తెలియని మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో నాగలక్ష్మి తలకు గాయమయింది. ఆమెను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తాడిగడపలో ఆలయ భూములకు కౌలు వేలం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానానికి చెందిన భూముల కౌలు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మోహన్‌రావు తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ ఆర్ఎస్ నెంబర్ 133లో దేవస్థానానికి చెందిన సాగుభూమి 8.72 ఎకరాలు 3 సంవత్సరాలకు అనగా 2024-2025 నుంచి 2026-2027 మార్చి 31వ తేదీ వరకు కౌలు వేలం ఉంటుందన్నారు. దీనికిగాను ఈ నెల 30వ తేదీ ఉదయం 11 గంటలకు దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

అంగన్‌వాడీ భవనాలకు మోక్షం

- దశాబ్దకాలం తర్వాత సిద్ధమైన భవనాలు
- రూ. 21 లక్షలతో అభివృద్ధి పనులు



వైకుంఠపురంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనం

పెనమలూరు: గోసాలలో ఒకటికాదు రెండు కాదు శంకుస్థాపన చేసిన తర్వాత ఏకంగా పదేళ్లకు అంగన్‌వాడీ భవన నిర్మాణం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చొరవతో తల్లులు, చిన్నారులు, గర్భిణులకు ఎట్టకేలకు న్యాయం జరిగింది. వివరాల్లోకి వెళితే గోసాల శివారు వైకుంఠపురంలో అంగన్‌వాడీ కేంద్రం చాలి చాలని అద్దె భవనంలో ఉండేది. ఇక్కడ నిరుపేద చిన్నారులు, తల్లులు, గర్భిణులు ఉండటంతో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేయాలని స్థానికులు గత 15 సంవత్సరాలుగా కోరుతున్నారు. అయితే 2014 టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం చేయడానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులు తుతుమంత్రంగా చేపట్టారు. రూ. 7 లక్షలతో భవన నిర్మాణ పనులు ప్రారంభించి మధ్యలో వదిలేశారు. దీంతో తల్లులు, చిన్నారులు, గర్భిణులు చాలి చాలని వసతులతో ఉండే అద్దె భవనంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చాలా ఇబ్బందులు పడ్డారు. చిన్నారుల కష్టాలు టీడీపీ పాలకులు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులపై దృష్టి పెట్టారు. గత టీడీపీ పాలనలో మంజూరు చేసిన రూ. 7 లక్షలు సరిపోవని అధికారులు చెప్పడంతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి మొత్తం రూ. 15 లక్షలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో అసంపూర్తిగా వదిలేసిన అంగన్‌వాడీ భవన నిర్మాణం పనులు చేపట్టి ఎట్టకేలకు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ అనంతరం భవనాన్ని ప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



గోసాలలో పూర్తి చేసిన ప్రహరీ నిర్మాణం

మరో భవనానికి సైతం మెరుగులు..

కాగా గోసాల ప్రధాన గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనానికి కనీస వసతులు లేకపోవడంతో వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచి సంగెపు శ్రీనివాసరావు సహకారంతో చర్యలు చేపట్టారు. అంగన్‌వాడీ భవనానికి చుట్టూ ప్రహరీ లేకపోవడంతో చిన్నారులు ఆడుకునే సమయంలో విషకీటకాలు వస్తాయని తల్లులు ఆందోళన చెందేవారు. దీంతో చిన్నారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 6 లక్షల నిధులు మంజూరు చేసింది. అంగన్‌వాడీ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలో ఉండే చిన్నారులకు భద్రత ఏర్పడింది.

ఎంతో మేలు చేశారు



అంగన్‌వాడీ భవనం లేక చాలా ఇబ్బందులు పడ్డాము. గత పాలకులు ఎవ్వరూ మా కష్టాలు పట్టించుకోలేదు. తల్లులు, చిన్నారులు, గర్భిణులను దృష్టిలో ఉంచుకుని పదేళ్ల తర్వాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణం పూర్తి చేసి ఎంతో మేలు చేసింది. ఇప్పుడు చిన్నారుల కష్టాలు తొలిగాయి.

– ఆవుల వరలక్ష్మి, వైకుంఠపురం

కౌంటింగ్ నేపథ్యంలో ప్రత్యేక చర్యలు

గన్నవరం డీఎస్పీ జయసూర్య



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జయసూర్య

హనుమాన్‌జంక్షన్ రూరల్: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో ఓట్ల కౌంటింగ్ రోజున శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని కాకాని భవనంలో రాజకీయ నాయకులు, సామాజిక మాధ్యమాల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. డీఎస్పీ జయసూర్య మాట్లాడుతూ జూన్ నాలుగో తేదీన కౌంటింగ్ కేంద్రాలు, ముఖ్య కూడళ్లలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీల ర్యాలీలు, ఊరేగింపుల నిర్వహణకు ఎలాంటి అనుమతి లేదని చెప్పారు. సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలతో పోస్టులు పెట్టడం, విద్వేషాలు సృష్టించడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు జరిగే విధంగా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ట్రైనీ డీఎస్పీ వేదశ్రీ, హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహామూర్తి, ఎస్ఐలు ఏడీఎల్ జనార్ధన్, పి.ఆర్జమ్మ, ఎం.చిరంజీవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

వల్లభనేని వంశీ ఆర్థిక సాయం



యువతి తల్లిదండ్రులకు నగదు, నూతన వస్త్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

గన్నవరం: విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామానికి చెందిన ముస్లిం యువతి వివాహానికి గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ ఆర్థిక తోడ్పాటునందించారు. ఈ మేరకు గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువతి తల్లిదండ్రులు షేక్ అన్వర్, హసీనాకు రూ. 25 వేల నగదు, నూతన వస్త్రాలను కార్యాలయ ఇన్‌ఛార్జ్ మేచినేని బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం వంశీమోహన్ విదేశీ పర్యటనలో ఉన్నప్పటికీ సేవా కార్యక్రమాలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు వంశీ ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని వైఎస్సార్ సీపీ నాయకుడు ఓలుపల్లి మోహన్‌రంగా అన్నారు. మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె.కరీముల్లా, వైఎస్సార్ సీపీ నాయకులు బీవీ నరసింహారెడ్డి, బాపట్ల అనిల్‌కుమార్, జీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ సక్రమంగా లెక్కించాలి

రిటర్నింగ్ అధికారి రాజు



పెనమలూరులో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఓ రాజు

పెనమలూరు: పోస్టల్ బ్యాలెట్ సక్రమంగా లెక్కించాలని పెనమలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.రాజు అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్ఓ డి.రాజు మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లు 3,587 ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. జూన్ నాలుగో తేదీన సాధారణ ఓట్లతో పాటు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కూడా ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఆరు ప్రత్యేక టేబుల్స్ వేస్తామని అన్నారు. ఏఆర్ఓ పర్యవేక్షణలో సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు వేయడానికి ఎన్నికల కమిషన్ పలు నిబంధనలు అమలు చేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌లు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వేసింది లేనిది తొలుత పరిశీలించాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటుకు డిక్లరేషన్ ఉందా లేదా, గెజిటెడ్ అధికారి సంతకం, బ్యాలెట్‌పై సీరియల్ నెంబర్ సక్రమంగా ఉందా లేదా పరిశీలించాలన్నారు. అన్ని సక్రమంగా ఉంటే పోస్టల్ బ్యాలెట్ ఉన్న కవర్ తెరిచి ఎన్నికల గుర్తుపై సక్రమంగా ఓటు వేశారా లేదా, ఒకే బ్యాలెట్‌పై ఇద్దరికి ఓటు వేశారా, బ్యాలెట్ పత్రంపై ఇంకా ఏమైన రాతలు రాశారా అని పరిశీలించాలన్నారు. ఏమాత్రం తేడా ఉన్న అనర్హత ఓటుగా గుర్తించాలని సూచించారు. ఇక సక్రమంగా ఉన్న ఓట్లు 6 టేబుళ్లకు ఇచ్చి 50 చొప్పున కట్టలు కట్టాలన్నారు. ఆ తర్వాత లెక్కింపు చేపట్టి ఆర్ఓకు తుది లెక్క అప్పగించాలని వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌పై ఏదన్న అనుమానం ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని లెక్కింపు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ఓలు ఎం.వెంకటేశ్వరరావు, ప్రసాద్, ఎంపీడీఓ కుమార్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయిన్లలో ముమ్మరంగా పూడికతీత



చెత్తను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో సమస్యాత్మకంగా మారిన పలు డ్రెయిన్‌లను గుర్తించి పారిశుద్ధ్య సిబ్బంది గురువారం పూడిక తీశారు. ప్రధాన గ్రామంతో పాటు అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్‌లలో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను తొలగించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగు పరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అంతర్గత రహదారులు, కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. పారిశుద్ధ్యంపై ఏమైనా సమస్యలు ఎదురైతే నేరుగా పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మానికొండలో చేతిరాత పోటీలో విద్యార్థులు



పెనమలూరులో డాన్స్ చేస్తున్న విద్యార్థులు



ఉయ్యూరు గ్రంథాలయంలో యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ముస్తాబాద గ్రంథాలయంలో విద్యార్థులు

ఉంగుటూరు: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మానికొండ శాఖా గ్రంథాలయ అధికారి ఎల్.హరికృష్ణ అన్నారు. మండలంలో తేలప్రోలు, ఉంగుటూరు, ఆత్కూరు, మానికొండ గ్రామాల్లోని శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి. చదరంగం, క్యారమ్స్, లూడో వంటి ఆటల పోటీల్లో గురువారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు చేతిరాత పరీక్షలు నిర్వహించారు.

పెనమలూరు: పెనమలూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు భరతనాట్యం, డ్యాన్స్‌లు, జానపద గీతాలు ఆలపించారు. శాఖా గ్రంథాలయ అధికారిణి హరీషా మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు చాలా ఆసక్తిగా పాల్గొంటున్నారని వివరించారు.

ఉయ్యూరు: యోగాతో మానసిక ప్రశాంతత దొరుకుతుందని యోగా శిక్షకుడు రిషికుమార్ అన్నారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో గురువారం యోగా శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగాతో ఆరోగ్యం లభిస్తుందని, దైనందిన జీవితంలో యోగా ఒక భాగం కావాలని సూచించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి రమణి పర్యవేక్షించారు.

గన్నవరం రూరల్: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు సమ్మర్ క్యాంపు ఉపయోగపడుతుందని ముస్తాబాద శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు చదువులతో పాటు డ్రాయింగ్, వ్యాసరచన, ఆటల పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అన్ని రంగాల్లో ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. జెడ్పీ హైస్కూల్, నవభారత్ హైస్కూల్, శ్రీచైతన్య, రవీంద్ర భారతి విద్యార్థులు పాల్గొనగా, పాఠకులు, గ్రామస్తులు విద్యార్థులను అభినందించారు. వారికి మరింత ప్రోత్సాహాన్ని అందజేస్తూ ఉపాహారం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం రూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలోని వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శేషసాయి గార్డెన్స్, ఐటీఐ కాలేజ్ రోడ్డు, బీబీగూడెం, వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి, కండ్రిక, కొత్తగూడెం, బుద్ధవరం, చింతగుంట, గొల్లనపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను బడిలో చేర్పించడానికి నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎల్ వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి సోమశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్స్ (సీడబ్ల్యూఎస్ఎన్) పిల్లలను ఎలా గుర్తించాలో వివరించారు. 21 రకాల వైకల్యాలు ఉన్న పిల్లలను గుర్తించి సమీప భవిత కేంద్రాల్లోగానీ లేకపోతే వారికి దగ్గరలో ఉన్న పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఇప్పటికే పశ్చిమ మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వనరుల కేంద్రంలో 10 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. ఈ బడి బాట కార్యక్రమం ద్వారా మరో 12 మందిని గుర్తించారని తెలిపారు. నాణ్యమైన విద్య, సంక్షేమ పథకాల ఫలాలు అందుకునేందుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్ టీచర్స్ సింధు, తేజస్వి పాల్గొన్నారు.

నేడు లక్ష పుష్పార్చన

కృష్ణలంక(విజయవాడతూర్పు): వైశాఖ మాసం సందర్భంగా విజయవాడ రాణిగారి తోట, పుట్టరోడ్డులోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు విశేష లక్ష పుష్పార్చన (మల్లెపూలతో) నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ యర్ర మధు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్పార్చనకు మల్లెపూలు ఇవ్వదలచిన భక్తులు శుక్రవారం ఉదయం 10గంటల లోపు దేవస్థానంలో అందజేయాలని కోరారు.

యనమలకుదురులో పోలీసుల తనిఖీలు



యనమలకుదురులో తనిఖీలు చేస్తున్న పోలీసులు



వీఎస్.పురం కాలనీలో కార్డన్ సెర్చ్ చేస్తున్న పోలీసులు



నిడమానూరులో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో గురువారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇందిరానగర్ కాలువ కట్టపై విస్తృత తనిఖీలు చేశారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ ఆస్మి ఆదేశాల మేరకు డీఎస్పీ ఆర్‌జీ.జయసూర్య పర్యవేక్షణలో పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు, కంకిపాడు సీఐ వి.శ్రీనివాసరావు, ఉయ్యూరు సీఐ హబీబుల్లా సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ప్రతీ ఇంట్లో తనిఖీలు చేశారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం తమకు ఇవ్వాలని కోరారు. వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేని 25 ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీఎస్.పురం కాలనీలో కార్డన్ సెర్చ్

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలో గురువారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సీఐ వరప్రసాద్ నేతృత్వంలో గన్నవరం, ఉంగుటూరు పోలీస్‌స్టేషన్లతో పాటు మచిలీపట్నం స్పెషల్ పార్టీ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాలనీవాసుల వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు. ఎటువంటి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణకు కార్డన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. కనీస వివరాలు తెలియకుండా ఎవరికీ ఇళ్లు అద్దెకు ఇవ్వకూడదని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం గురించి ఎటువంటి సమాచారం ఉన్న పోలీసులకు తెలియజేయాలని కోరారు.

నిడమానూరులో ఫ్లాగ్ మార్చ్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులో గురువారం పటమట పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. విజయవాడ సిటీ పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి రామకృష్ణ ఆదేశాల మేరకు డీసీపీ ఆదిరాజ్ సింగ్ రానా ఉత్తర్వులతో ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఎన్నికల కౌంటింగ్ రోజు ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకుండా శాంతియుత వాతావరణం నెలకొనే విధంగా ప్రజలను అప్రమత్తం చేస్తూ వారికి అవగాహన కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఏసీపీ పి.భాస్కరరావు, పటమట సీఐ కేఎన్ మోహన్‌రెడ్డి, ఎస్ఐలు దుర్గాప్రసాద్, వల్లి పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు తిప్పలు తప్పేదెన్నడో..?



గోసాల సెంటరులో నిలిచిన వర్షపునీరు

కంకిపాడు: మురుగు తిప్పలు తప్పక వాహనదారులు, ప్రజలు నానా అగచాట్లు పడుతున్నారు. రోజుల తరబడి మురుగు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లి ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి గోసాల ప్రధాన సెంటరులో అప్రోచ్ నిర్మించి డివైడరు ఏర్పాటు చేశారు. అప్రోచ్ పూర్తి పల్లంగా ఉంది. చిన్న వర్షానికే వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి ఉంటుంది. మురుగు కదలడం లేదు. ఫలితంగా అప్రోచ్ మీదుగా రాకపోకలను సాగించలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా వెళ్లే వాహనాల కారణంగా మురుగు ఎగిసిపడి రోడ్డు మార్జిన్‌ల్లో వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు, పాదచారులపై పడుతుంది. జాతీయ రహదారుల శాఖ సమస్యపై దృష్టి సారించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రకటన

నా క్లయింటు కోలవెన్ను గ్రామం, కంకిపాడు మండలం, కృష్ణాజిల్లా, డోర్ నెం.3-95 కాపురస్తులు తాడిశెట్టి శ్రీనివాసరావు గారి భార్య తాడిశెట్టి వెంకటరమణ గారు యావన్మందికి తెలియజేయునది ఏమనగా... నా క్లయింటు భగ్గా భైరాగి గారి వారసుల నుండి ఈ క్రింద ఉదహరించిన కోలవెన్ను గ్రామ రీసర్వే నెం. 481/9రులో చ.గ.131లు స్థిరాస్తి నివేశన స్థలము అస్తి కొనుగోలు సమయంలో భగ్గా భైరాగి వారి పేరున ఈ ఆస్తికి తాలూకు ఒరిజనల్ డాక్యుమెంట్ నెం.490/1977 ఇంతకు పూర్వమే అనగా 2000 సం.నకు పూర్వమే అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని అందుకు బదులు డాక్యుమెంట్ నెం. 490/1977 ఫోటో కాపీని జతపరచి నా క్లయింటు పేరున కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ వద్ద డాక్యుమెంట్ 1294/2023గా విక్రయ దస్తావేజు రిజిస్టర్ చేసియున్నారు. ఇందుమూలముగా కాలిపోయిన ఒరిజనల్ డాక్యుమెంట్ నెం. 490/1977 విషయంలో ఎవరికైనా అభ్యంతరములు వుంటే ఈ పేపరు ప్రకటన ఇచ్చిన 7 రోజులలోగా ఈ క్రింది అడ్రస్సుకు సంప్రదించి అభ్యంతరాలు తెలియజేయవలసినదిగా ప్రకటన. చెప్పిన 7 రోజులలోగా ఎటువంటి అభ్యంతరాలు స్వీకరించబడకపోతే ఇక భవిష్యత్‌లో ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు లేవని తీర్మానించి, ఇకపై ఎటువంటి అభ్యంతరాలు వచ్చినా అవి పరిగణనలోకి తీసుకోబడవని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఆర్. ప్రేమ్‌రాజ్, అడ్వకేట్
డి.నెం.53-1-53/సి, విజయనగర్ కాలనీ
విజయవాడ-520008. సెల్:9182245520

ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఉండాలి

కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమానాథశర్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఉండాలని కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమానాథశర్మ అన్నారు. గవర్నర్‌పేటలోని డాక్టర్ కేఎల్ రావు భవన్‌లో గురువారం గురువిశ్వస్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆధ్వర్యంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గురుదేవుల పాద పూజ, పీఠ పూజ చేశారు. విశ్వస్ఫూర్తి గురువులు అందించిన మూల మంత్రాన్ని 108 సార్లు పఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ పౌర్ణమి విశిష్టతను వివరించారు. బాల్యం నుంచే పిల్లలకు విశ్వగురు కాన్సెప్ట్‌ను నేర్పించాలన్నారు. ఆ బాధ్యతను పెద్దలు తీసుకోవాలని సూచించారు. చేయూత ఫౌండేషన్ డైరెక్టర్ కృష్ణకుమారి మాట్లాడుతూ మనసు గురించిన వివిధ భావనలు వివరించారు. మనసును నియంత్రించుకోవాలని, అప్పుడే మంచి భావనలు, ఆలోచనలు కలుగుతాయన్నారు. చిరంజీవి జె వేధాన్ని, టి.చైతన్య స్ఫూర్తి, టి ఇషా శ్రీ గ్రంథాల్లోని గురుదేవుల కొటేషన్లను వివరించారు. కార్యక్రమంలో రంగరాయ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నజియా ఫరా, స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆథర్ మేకా రజనీకాంత్, అట్లూరి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.